క్లుప్తంగా

రేపే శ్రీనివాస్‌నాయుడు నామినేషన్



నిడదవోలు: వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా జి.శ్రీనివాస్‌నాయుడు గురువారం ఉదయం 11.07 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు. స్థానిక తహసీల్దార్ ఆఫీసు సమీపంలోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శ్రీనివాస్‌నాయుడు నామినేషన్ దాఖలు చేస్తారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయం వద్ద నుంచి పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి ఆయన ఆర్వో కార్యాలయానికి చేరుకుంటారు. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా నామినేషన్ దాఖలు కార్యక్రమానికి తరలి రావాలని శ్రీనివాస్‌నాయుడు కోరారు.

కాశీవిశ్వనాథానికి సేవారత్న పురస్కారం



జస్టిస్ శ్రీసుధ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కాశీవిశ్వనాథం

దేవరపల్లి: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ వారి ప్రతిష్ఠాత్మక ఉగాది పురస్కారం దేవరపల్లికి చెందిన యువ పారిశ్రామిక వేత్త శ్రీకాకొళపు కాశీవిశ్వనాథంకు దక్కింది. ఆ సంస్థ తమ ఉగాది పురస్కారాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 40 మందికి అందించింది. హైదరాబాద్‌లోని హోటల్ ప్లాజాలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీకాకొళపు కాశీవిశ్వనాథానికి సేవారత్న పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి శ్రీసుధ చేతుల మీదుగా అందజేశారు. విశ్వగురు వరల్డ్స్ సంస్థ వ్యవస్థాపకుడు రాంబాబుకు ఈ సందర్భంగా విశ్వనాథం కృతజ్ఞతలు తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నిడదవోలు: ఈ నెల 25న మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులు మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.కుసుమకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 3.3 బిలియన్ల జనాభా మలేరియా వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో సమాజాన్ని జాగృతం చేయడం తమ ప్రథమ కర్తవ్యంగా విద్యార్థులు భావించాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. జ్యోతి తన ప్రసంగంలో దోమల నుంచి ఏ విధంగా రక్షణ పొందాలి? నివారణ మార్గాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. కె.దండేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నల్లజర్ల: వేసవిలో రోగుల దాహార్తి తీర్చేందుకు నల్లజర్ల పీహెచ్‌సీ ఆవరణలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మంచినీటి చలివేంద్రాన్ని అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు బొండల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు గంగాధరం, సిరాజుద్దీన్, సీహెచ్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

264 మందికి వైద్య పరీక్షలు



కడియపు సావరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కడియం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కడియపుసావరం సచివాలయం 2 పరిధిలో మంగళవారం 264 మందికి వైద్య సేవలు అందించినట్టు శిబిరం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.నాగసాయిమౌర్య తెలిపారు. అలాగే 9 మందికి కంటిపరీక్షలు నిర్వహించామన్నారు. ఆరోగ్యశ్రీకి ఒకరిని రిఫర్ చేసినట్టు తెలిపారు. వైద్యులు ఎం.మణిజ్యోత్స్న, పర్సాద్, చైతన్య శేఖర్, కె.రాజేష్ వైద్యపరీక్షలు చేశారన్నారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ శిబిరాన్ని సందర్శించారన్నారు.

లబ్ధిదారుల మదిలో జగన్ సుస్థిరం

- వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- అయ్యవరం, కొత్తగూడెం, దూబచర్ల గ్రామాల్లో విస్తృత ప్రచారం



అయ్యవరంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: అందరికీ మంచి చేసే జగనన్నకు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉందని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని అయ్యవరం, కొత్తగూడెం, దూబచర్ల గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి మంగళవారం సాయంత్రం ఆమె ప్రచార రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయ్యవరంలో సర్పంచ్ గెడిశే వీరాస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు మారుబోయిన సత్యవతి, దూబచర్లలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చేబ్రోలు బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ మునాఫ్, పంది సత్యనారాయణ, తొమ్మండ్రు రవి ఆధ్వర్యంలో ప్రచారం సాగింది. ఈ సందర్భంగా హోం మంత్రి వనిత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి చరిత్రలో నిలిచిపోయే పాలన అందించారన్నారు. అటువంటి గొప్ప పాలనలో తాను కూడా భాగస్వామిని అయినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. జగన్ పాలనలో ఎంత మంచి జరిగిందో, ప్రజలు ఎంత మేలు పొందారో ఆ ఫలాలు పొందిన వారికి తెలుసన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు ఇలా ఏ వర్గం వారిని అడిగినా జగనన్న గొప్పతనం గురించి తడుము కోకుండా చెబుతారన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి, నాయకులకు ప్రజలు ఎప్పుడు అండగా ఉంటారని వనిత అన్నారు. మే13 న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, బంక అప్పారావు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, లైటింగ్ పండు, మద్దిపాటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు మద్దూరి నాగేశ్వరరావు, ముప్పిడి వెంకటరత్నం, యలమర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహితంగా అభివృద్ధి

- నా తండ్రిని మళ్లీ గెలిపించండి
- శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా వరుణ్‌సాయి ప్రచారం



కె.సావరంలో తండ్రి తరఫున ప్రచారం చేస్తున్న వరుణ్‌సాయి

ఉండ్రాజవరం: అవినీతికి వ్యతిరేకంగా, ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు కృషి చేశారని ఆయన తనయుడు వరుణ్ సాయి అన్నారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా మండలంలోని కె.సావరం గ్రామంలో వరుణ్ సాయి మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం సాగించారు. తన తండ్రికి మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని వరుణ్‌సాయి ఓటర్లను అభ్యర్థించారు. మరోసారి గెలిపిస్తే గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి సంక్షేమ పథకాల రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో బస్వా రామన్నరావు, మీసాల సురేష్, బస్వా వీరరాఘవులు, బస్వా శ్రీనివాసు, వర్రే రమేష్, బస్వా సర్వేశ్వరరావు, నార్ని దుర్గారావు, ఉన్నమట్ల అయ్యప్ప, సోమసుందరం, రంకిరెడ్డి లీల, సూరవరపు లక్ష్మి, కందుల లక్ష్మి, బస్వా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు 4వ వార్డులో..

నిడదవోలు: వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడికి మద్దతుగా ఆయన కుమారుడు వరుణ్‌సాయి మంగళవారం పట్టణంలోని 4వ వార్డు యాదవుల వీధిలో ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ప్రతి ఇంటికి వెళ్లారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధితో పాటు ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను అందజేశారు. తన తండ్రి శ్రీనివాస నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు.

శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా ప్రచారం



నిడదవోలు 11వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మంగళవారం పట్టణంలోని 11వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అదే సంక్షేమం, అభివృద్ధీ ఇకపై కూడా కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కౌన్సిలర్లు దాకే అనిల్‌కుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, ఉసురుమర్తి జాన్‌బాబు, దిరిశన రామచంద్రరావు, పార్టీ నాయకులు గంగుల గోపి యాదవ్, అప్సర్ జానీ, షేక్ జాకీర్, ఆలమూరి రాజ, కలగా రమణ, ఉర్ల హరికృష్ణ, వంగా నాగేశ్వరరావు, తేలేటి కోటేశ్వరరావు, గూడూరి గౌరి, చిలకల మల్లికార్జునరావు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో 30 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖలు కార్యదర్శి షర్మిలకు అందిస్తున్న ఘంటావారిగూడెం వలంటీర్లు



చాగల్లు ఎంపీడీవో ఆఫీసు వద్ద రాజీనామా పత్రాలతో వలంటీర్లు

నల్లజర్ల: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సోమవారం పుల్లలపాడు, జగన్నాథపురం సచివాలయాల పరిధిలోని 24 మంది వలంటీర్లు రాజీనామాలు చేయగా, మంగళవారం ఘంటావారిగూడెంలో 11 మంది, ప్రకాశరావుపాలెంలో విధులు నిర్వర్తిస్తున్న 19 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. వారంతా తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలు పార్టీల బేధం లేకుండా ఐదేళ్ల పాటు నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేశామన్నారు. అయితే తమను కించపరుస్తూ, నిందలు వేసిన కూటమి నేతల వైఖరికి నిరసనగా రాజీనామాలు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పుడు తమకు జగనన్న రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. తప్పకుండా ఆయన తరఫున ఎన్నికల్లో ప్రచారం చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. రాజీనామా చేసిన వారిలో ఘంటావారిగూడెంలో గోపి, వంశీ, గౌతమి, బీబీ, సౌందర్య, పుష్ప, విజయమణి, ప్రకాశరావుపాలెంలో రవితేజ, దుర్గారావు, సీతారత్నం, శివపార్వతి తదితరులు ఉన్నారు.

చాగల్లు మండలంలో మరో 17 మంది ..

చాగల్లు: వ్యక్తి గత కారణాలతో మండలంలోని 17 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఎస్.బుజ్జికి అందజేశారు. చిక్కాల గ్రామం నుంచి ఇద్దరు, మార్కొండపాటు గ్రామ సచివాలయం నుంచి 15 మంది వాలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా జగనన్న



షేక్ షాజహాన్

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలకు అన్ని విధాలా అండగా నిలిచారని ఉండ్రాజవరం మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ 2019లో అధికారం చేపట్టాక ముస్లింలకు తన క్యాబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవితో పాటు ముస్లిం మహిళకు శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ పదవిని కూడా ఇచ్చి గౌరవించారన్నారు. ముస్లిం మైనార్టీల సొంత ఇంటి కలను నెరవేర్చారన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ముస్లింలకు ఏడు అసెంబ్లీ సీట్లు కేటాయించారన్నారు. చరిత్రలో ఏ నాయకుడూ చేయని విధంగా ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని షాజహాన్ గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీలంతా ఎప్పటికీ వైఎస్సార్ కుటుంబానికి అండగా ఉంటారన్నారు. ఎన్‌డీఏ కూటమి ఎన్ని మాయమాటలు చెప్పిన, ఎన్ని వాగ్దానాలు చేసినా ముస్లిం మైనార్టీలు వైఎస్సార్ సీపీకి విజయం చేకూరుస్తారని ఆయన పేర్కొన్నారు.

కాపు నాయకుడిపై దాడి తగదు



పెద్దేవంలో కాపు నాయకుల సమావేశంలో కాపు సంఘం అధ్యక్షుడు వెంకట్రాయుడు

తాళ్లపూడి: కాపు నాయకుడైన తోట రామకృష్ణపై దాడి చేయడం తగదని ఉభయ గోదావరి జిల్లాల కాపు సంఘం అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ, కాపు జేఏసీ నాయకుడైన తోట రామకృష్ణపై ఇటీవల కొవ్వూరులో ఒక సామాజిక వర్గం నాయకులు దాడి చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం మండలంలోని పెద్దేవం గ్రామం వచ్చిన చినమిల్లి వెంకట్రాయుడు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తోట రామకృష్ణతో మాట్లాడారు. అనంతరం ఆ గ్రామంలో కాపు నాయకులతో సమావేశం నిర్వహించారు. పలు విషయాలు వారితో చర్చించారు. ఇది రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం అని, దీనిని సామరస్యంగా పరిష్కరించాలని పలువురు పేర్కొన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైఎస్సార్ సీసీ కొవ్వూరు మండల కన్వీనర్ సుంకర సత్యనారాయణ, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, నాయకులు బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, వనిమిరెడ్డి శ్రీను, పోశిన శ్రీకృష్ణదేవరాయలు, విత్తం నాని, శీర్ల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు జాగ్రత్తగా పూరించాలి



రాజకీయ పార్టీల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అత్యంత జాగ్రత్తగా నామినేషన్ పత్రాలను పూరించాలని నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్ సూచించారు. నామినేషన్ ప్రక్రియపై మంగళవారం రాత్రి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కొవ్వూరులో అవగాహన సదస్సు నిర్వహించారు. నామినేషన్ నమూనా ఫారాన్ని నాయకులకు ఆయన అందజేశారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు సహకరించాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసేటపుడు అభ్యర్థితో పాటు విధిగా ప్రతిపాదన చేసే వ్యక్తి కూడా హాజరు కావాలన్నారు. సమావేశానికి తహసీల్దార్ కె.మస్తాన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వానికి సర్వం సిద్ధం

- రేపటి నుంచి 25వ తేదీ సాయంత్రం 3 గంటల వరకూ స్వీకరణ
- అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి
- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



నిడదవోలు ఓటు అవగాహన ర్యాలీలో రిటర్నింగ్ అధికారి వెంకటరమణ నాయక్ తదితరులు



కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్

కొవ్వూరు: ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 25వ తేదీ వరకూ కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం నుంచి రోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. నామినేషన్ దాఖలు సమయంలో ప్రతి అభ్యర్థితో పాటు మరో నలుగురిని లోపలికి అనుమతిస్తామని చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేయనున్నట్టు ప్రకటించారు. అభ్యర్థితో పాటు మూడు వాహనాలకు మాత్రమే కార్యాలయ ఆవరణలోకి అనుమతిస్తామన్నారు. ఒక వేళ అభ్యర్థికి నేర చరిత్ర ఉంటే మూడు సార్లు పత్రికా ప్రకటన ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఒక్కో అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థికి ఒకరు, స్వతంత్ర్య అభ్యర్థికి పది మంది ప్రతిపాదన చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన జరుపుతామని సబ్ కలెక్టర్ చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ చివరి గడువు అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి ఒక్క అభ్యర్థీ ప్రత్యేక బ్యాంకు ఖాతా సమర్పించాల్సి ఉంటుందన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి చుట్టూ వంద మీటర్ల వద్ద బారికేట్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల ఖర్చు లెక్కలు ప్రారంభం అవుతాయన్నారు. కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులు, ఈనెల 14వ తేదీతో ముగిశాయన్నారు. పరిశీలన అనంతరం తుది ఓటర్ల జాబితాను ఈనెల 25న ప్రకటిస్తామన్నారు. లౌడ్ స్పీకర్‌కు అనుమతి లేకుండా నడుపుతున్న టీడీపీ ప్రచార వాహనంపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశామన్నారు. పలు సందర్భాల్లో ఇంతవరకూ నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.4 లక్షల వరకూ నగదు పట్టుబడిందన్నారు. ఈ మొత్తానిక సరైన ఆధారాలు చూపించడంతో సొమ్మును వాటి యజమానులకు అప్పగించా మన్నారు.

నిడదవోలు నియోజకవర్గంలో

నిడదవోలు: అసెంబ్లీ నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల అవుతుందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణ నాయక్ చెప్పారు. గురువారం నుంచి ఈ నెల 25 వరకూ ప్రతి రోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో రమణనాయక్ మాట్లాడుతూ ఇప్పటికే ఆర్వో కార్యాలయం వద్ద నుంచి 100 మీటర్ల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. సహాయ రిటర్నింగ్ అధికారులు వి.నాగభూషణం, టి.రామ్‌భూపాల్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు అవగాహన ర్యాలీ

ఓటు హక్కుపై పట్టణంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామ కచేరీ వద్ద గల ఆర్వో కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణ నాయక్ ఓటు హక్కు ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వి.నాగభూషణం, కె.నవీన్ కుమార్, డి. సుధ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్ భూపాల్‌రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు సిద్ధం



వేగేశ్వరపురంలోని సీతారామలక్ష్మణుల విగ్రహాలు

తాళ్లపూడి: ధర్మబద్ధతకు, పితృవాక్య పాలనకు శ్రీరాముడు నిలువెత్తు చిరునామా. అలాంటి రఘురాముడిని కొలిచేందుకు ఏటా నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు వివిధ గ్రామాల్లోని రామ మందిరాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని వేగేశ్వరపురంలోని శ్రీరామ్‌నగర్‌లోని రామాలయం వద్ద, వడ్డీల రామాలయం వద్ద యువత చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. తాళ్లపూడి, పోచవరం, మలకపల్లి, తుపాకులగుడెం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, తాడిపూడి, ప్రక్కిలంక, గజ్జరం తదితర గ్రామాల్లో నవమి వేడుకలకు చలువ పందిళ్లు వేశారు.

'మేమంతా సిద్ధం' సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు



పాలంగి నుంచి సీఎం సభకు బయలుదేరుతున్న నాయకులు, అభిమానులు

ఉండ్రాజవరం: భీమవరంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం ఎన్నికల ప్రచార సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని 15 గ్రామాల నుంచి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఎండను సైతం లెక్క చేయకుండా భీమవరానికి తరలి వెళ్లారు.

బాలికల సదనం సందర్శన



బాలికలతో డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: స్థానిక ప్రకాశం నగర్‌లోని ప్రభుత్వ బాలికల సదనాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మంగళవారం సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి బాలికలతో మాట్లాడారు. పరిశుభ్రత పాటిస్తూ వేళకు ఆహారం తీసుకోవాలని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఏ విధమైన అసౌకర్యం కలిగినా వెంటనే డీఎల్ఎస్‌ఏ దృష్టికి తీసుకురావాలన్నారు.


నేడు మూడు గ్రామాల్లో వనిత ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం ద్వారకాతిరుమల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పి. కన్నాపురం, సత్తాల, గుణ్ణంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఎస్పీ అభ్యర్థి చిత్రసేన్ ప్రచారం

ఉండ్రాజవరం: బీఎస్పీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మాపు చిత్రసేన్ మండలంలోని మోర్త గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. తన మద్దతుదారులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి, తమ పార్టీకి ఓటు వేయవలసిందిగా అభ్యర్థించారు. ప్రచారంలో నల్లి రమేష్, మత్రి మహాలక్ష్ముడు, కప్పల ఇశ్రాయిల్, చిన్నం వెంకటేశ్వరరావు, చింత రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతిష్ఠాత్మక భవన నిర్మాణ సంస్థ క్రెడాయ్ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు అన్నారు. కవలగొయ్యిలోని క్రెడాయ్ భవనంలోని సమావేశ మందిరంలో గౌరవ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రెడాయ్ సభ్యులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికలలో తమ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. రుడా చైర్మన్ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఎన్నికల తర్వాత మాస్టర్ ప్లాన్ అమలుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజమండ్రి శాఖ చైర్మన్ సూరవరపు శ్రీనివాస్, అధ్యక్షుడు మన్యం ఫణి కుమార్, కార్యదర్శి చల్లా బాలమురళి, కోశాధికారి నరసింహరావు, ప్రతినిధులు నందెపు శ్రీనివాస్, పూడి శ్రీనివాస్, రెడ్డి రామకృష్ణ, రంగ ప్రసాద్, వెలుమూరి భీమశంకర్ పాల్గొన్నారు.